స్కెచ్

# "అంతేలే పేదల బ్రదుకులు"

కాలజ్ఞానం సుబ్బారావు

మరుచటిదినం భోగి పండుగ. తెల్లవారగట్ల లేచి అందరూ తలంటుకొని మంచి మంచి బట్టలు ధరిస్తారు. ఉల్లాసంగా భోగి మంటవేసి చుట్టూ గుమిగూడుతారు. వీరడు ఆలోచించాడు. రేపైనా తనూ, భార్య, చంటిబిడ్డా కడుపునిండా తినొద్దూమరి? గుడ్డలు లేకపోతే మాన్లే!... అయినా రెండు రోజుల్నుంచీ సరిగ్గా తిండిలేక కృశించాడు తాను. భార్య ఏమో గోగిక్షిదాయే! పిల్లోడా-బిడ్డయిపోయె! అప్పటి స్థితిలో భార్య మంచంపైనే ఉంది నీరసంతో. బిడ్డ ప్రశాంతంగా నిద్రిస్తోంది. పండుగనాడు ఉత్సాహంగా, ఆనందంగా వుండాలి కదూ?... కానీ...కడుపునిండా కూడు, ఒంటినిండా బట్ట, ఇంటినిండా ఐశ్వర్యమూ వుంటేగా యీ ఉత్సాహమూ, ఆనందమూనూ! వీరడిబుర్రలో పరుగులెత్తాయి వైభావాలు. ప్రత్యుత్తరం ఏమీ తోచకపోయినా లేచాడు పైకి. చినిగిపోయిన తన పై గుడ్డపీలికతీసి నెత్తిన వేసుకున్నాడు. ఎవ్వరికీ చెప్పలా. ఒక్కటే వీరడి ఉద్దేశ్యం! ఏరీతిగానైనా తనవాళ్ళ పొట్టలు "రేపైనా" నిండాలి. పండుగనాడుకూడా పస్తేనా?

మిల్లులో సమ్మె చేసిందాంట్లో పాల్గొనటం మూలాన ఉన్న ఉద్యోగం కాస్తా వూడింది. పోనీ-ఆ కోరమీసాల గొక్కిరాయి - వాణ్ణే-ఆ యజమానినే మళ్ళీ ప్రాధేయపడితే?... దానికి తన మనస్సంగీకరించడం లేదుకదా "ఇంత కన్నా నీచ సముపార్జనం ఉందా?" అనే ప్రశ్న తన్ను కలవరపెట్టింది. దానితో ఆ ఆలోచన మాయమయ్యింది వీరడి బుర్రలోంచి. అబ్బ! ఆనాడు సమ్మెకు తాను తోటి కూలీల్ని, ప్రోత్సాహిస్తుంటే యజమాని చూచాడు! ప్రత్యేకంగా పిలిపించి ధనాశ చూపాడు. తనెంతగా మిణకరించేడా 'డబ్బులసంచి'ని చూచి! కానీ, వెంటనే తోటి కష్టజీవులు జ్ఞాపకానికొచ్చేసరికి తటాలున 'అంత డబ్బూ' పురుగుల పుట్టగా తెలియలా తనకు?- అందుకే ఆనాడు ధిక్కరించేడు యజమాని కార్యాల్ని. తత్ఫలితం ప్రకృతం తన దుస్థితి! వీరడు చలించాడు కొద్ది క్షణాలు. మళ్ళా భార్యా బిడ్డల దీనముఖాలగుపించేసరికి కాళ్ళు చకచకా ఎక్కడికో యీడ్చుకపోయాయి. అలా ఎంత దూరం నడిచాడో ఏ దిశగా వెళ్తున్నాడో అనే జ్ఞానం లేకుండానే వీరడు నడక సాగించాడు. పోనీ ఆత్మహత్య చేసుకుంటే?-ఛీ! తనకోసం కాచుకున్న ఆ నిస్సహాయుల గతేమవుతుంది? అంతేకాదు! చచ్చిసాధించడం ఏమీలేదు. ఇది నిజం కదూ? కాబట్టే వీరడికి కొంత నిబ్బరం కలిగింది. "పుట్టించిన దైవం రక్షించకపోడులే" అన్నదాంట్లో తనకు నమ్మకమున్నా అప్పు డేదారీ కనుపించక పోవడంమూలాన ఏదో సందేహం ఆవరించింది తనను. దినమూ గంగమ్మ గుడిముందు వెళ్తూ 'దండం' పెట్టేవాడు. ఆ దినం గుడిదాటినా ఆ సంగతే మరచాడు. పూర్తిగా 'రేపటి సంగతి' ఆవరించింది వీరడిమనస్సును. తను పనిచేస్తుండే ప్పుడు స్నేహంగా ఉన్న రంగణ్ణి సహాయం అడగాలనే తలంపు కలిగేటప్పటికి గిరుక్కున వెనక్కి తిరిగాడు. పాడుదినం! మామూలు కూలితనం చెయ్యలేక పోయ్యాడానాడు. అసలు కూలీ దొరికితేగా? ఏంచెయ్యడం? రంగడు తన కోరిక తీర్చగలడా? వాడికిమాత్రం పండగ కదూ? పిచ్చెత్తినట్లయింది వీరడికి. ఇంతలో రంగడి ఇల్లు చేరాడు. పిలిస్తే పాతనేస్తు డొచ్చాడు బయటికి. మిట్టమధ్యాహ్నం ముఖం వేలవేసుకొని వచ్చిన వీరణ్ణి చూచేప్పటికి రంగడి గుండె కరగిపోయింది. ఏమైనా లేనివాళ్లూ లేని వాళ్ళూ ఒక్కటే కదూ! జాలిపడ్డాడు రంగడు. తీరా వీరడి కోరికవిన్నాక వెంటనే తన నిస్సహాయత వెళ్ళబుచ్చలేకపోయ్యాడు. వీరడికి కొద్ది

గంజిపోసి బతుకుదామనుకున్నాడు. కాలేకడుపు వీరణ్ణి 'గంజి' తాగడాని కామోదింప చేసింది. యింటి జ్ఞాపకం- రోగిష్టిభార్య- సగం చచ్చిన బిడ్డా అగుపడ్డా కూడా వీరడి నేత్రాలకి...

రంగడి దగ్గర చిల్లిగవ్వ లేదని తెలిసి ఏమీ పాలుపోక వస్తుంటే ఓ ఆసామికి కూలీ కావాల్సివచ్చింది. ఆ ధనవంతుడైన ఆసామీ సామాను వీరడి నెత్తికెక్కించి మూడుమైళ్ళ దూరంవుండే స్టేషన్‌కి పోవాలన్నాడు. బరువైన వాటిని వీరడు ఎత్తలేకపొయ్యాడు కానీ, రంగడి గంజి- భార్యాబిడ్డల పోషణ - ఖర్చు గిలిగింత పెట్టడంతో బరువంతా తేలికై పోయింది. ఎట్లాగో స్టేషన్ చేరుకున్నాడు. ఆసామీ వీరడి చేతిలో అర్ధరూపాయి వుంచి పోబోతే "ఏమండీ! బాబుగారూ?...ఇంతేనా?...ఇంకో పావలాఐనా దయచెయ్యండి" అని వీరడు బ్రతిమాలాడు. ఆ కర్కశహృదయుడు, "పోరా! యిట్టామేమే మీకు పొగరెక్కించింది" అంటూ ఏమేమో వాగుతూ గేటుదాటాడు. కాగా, ఆచోటవున్న పెద్దమనుషుల్లో కొందరు, "ఇంకా ఎంతయిస్తారేం కూలీ?" అంటూ గద్దించారు. తనమాటలకి విలువుందా? తనపై జాలి గొనేవాళ్ళెవళ్ళో జనంలో? కండ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి! ఎంత బరువు? తల దిమ్మెక్కింది. ఎండలో అంతదూరం నెత్తిన బరువుతో నడిస్తే ఫలితం?-కాళ్ళకి పట్టు వేసికోవాలి రాత్రికి. అప్పటికే సాయంత్రమయింది. వస్తూవస్తూ బజారులో బియ్యం ఓ అర్ధశేరు, చిల్లర మిగతా కొద్దిపాటి సామాన్లూ "గంజై"నా తాగుదామనే ఆశతో కొనుక్కొని యిల్లు చేరాడు ఇంట్లో అది వుంచి కేకేసాడు. దీపంలేదు! బదులంతకుముందే లేదు! కొద్దిక్షణాలకే సన్ననిమూలుగు వినబడింది. వీరడి కాళ్లు తక్షణం ఆవైపు పరుగులెత్తినై. దగ్గరి కెళ్లేసరికి మంచంమీది రోగిష్టి భార్య చేతులతో 'దాహం' అని సౌజ్ఞ చేసింది. మసకచీకటిలో గమనించాడు. చంటిబిడ్డ పక్కనే పడుకోనుంది. నీళ్ళకై వెతుకులాడాడు. ఎక్కడివి?-ఎవ్వరైనా పట్టుకొస్తేగా? పక్కింటికెళ్ళి ఓగ్లాసెడు నీళ్ళు పట్టుకొచ్చాడు. కాస్త నీళ్ళు భార్య గొంతులో పోసి, తాను సాధించింది చెప్పాడు. వీరడి భార్య కొన్ని గుటకలు మింగింది. ఆపైన ఇక మాట్లాడడానికి శక్తిలేక కాబోలు ఓరగా ఒరిగి కండ్లు మూసింది. "ప్రశాంతంగా నిద్రించనీ!" అనుకొని అప్పటికే పూర్తిగా అలసివుంటం మూలాన తనూ పై గుడ్డ క్రిందేసుకొని బోర్లపడ్డాడు.

ఎంతసేపు నిద్రించాడో? ఉన్నట్లుండి "కెవ్వు" మని కేక అతణ్ణి లేపింది. వెంటనే గుర్తొచ్చింది అది భార్య స్వరమని! చప్పున వెళ్ళి మంచంమీది భార్యను చూచాడు. చలనం లేదు! అప్పుడే బయటికొచ్చాడు! చుట్టూవున్న యింటివాళ్ళంతా 'భోగి మంట' లేసి చలి కాచుకుంటున్నారు. తనూ వెయ్యొద్దూ?......ఓ! ఇంతకూ భార్య కేమయింది? ఓ కాలుతూన్న తాటిమట్ట పక్కింటి భోగిమంటనుండి తెచ్చుకొని ఇంటిలో వెతికాడు. భార్య నిశ్చింతగా నిద్రిస్తోంది. మరి ఆ కేక ఎవరు వేసారు? ముక్కు దగ్గర వేలుంచితే శ్వాస లేనట్లు తెలిసింది. అంతలో చెయ్యి కాలటంవల్ల దాని విసిరాడు చేతిలోంచి. భార్య ఒళ్ళు చల్లబడింది. ఇంకేం! భార్య ఎప్పుడో ఈలోకం వదిలింది. అది చావు కేక అని యిప్పుడు వీరడి కర్థమయింది. చిన్నబిడ్డకని దేవులాడితే అది చచ్చిన తన తల్లి రొమ్ముల్లో నోరుంచుకొని పడుకోనుంది. వీరడి చేతులు తగిలేప్పటికి బిడ్డ లేచి ఏడుపు మొదలెట్టింది. వీరడి కొక్కసారిగా ప్రాణాలెగిరి పోయేంత బాధ కలిగింది. ఆ దుఃఖంలో తన యిల్లు తాను విసరిన తాటిమట్ట నిప్పుతో అంటుకోవడం గోచరించలేదు. విచారం ముంచేసింది. తెలివితప్పి పడిపోయాడు. సెగ తగిలేప్పటికి మెలకువ వచ్చింది. బిడ్డ గొంతు ఏడ్చిఏడ్చి బొంగురు పోయింది. బిడ్డ నెత్తికొని బయటికి దూకాడు! అయినా చేతికీ కాళ్ళకీ గాయాలంటాయి. ఇల్లు భస్మీపటలమయినా కండ్లు వప్పగించారే కానీ ఎవ్వరూ ముందుకు రాలా! వీరడికి మతి చెదరింది. తన యింటిముందు కూర్చొని బిడ్డను చేతుల్లో వుంచుకొని అగ్నిదేవుడికి ఆహుతి అయ్యే గుడిసెను పిచ్చిగా చూస్తున్నాడు. ఏడవడానికి కూడా గొంతు రాలా! భార్య ఇంటితో దహనమయ్యింది. భోగికి ఇల్లు-భార్య ఆహుతయ్యారు! తనెంత పెద్ద మంట వేసాడు!